# సాహిత్యం ద్వారా మానవ విలువలు

విలువల విద్య మనతో మనం, మన కుటుంబంతోనూ, సమాజంతోనూ సామరస్యాన్ని స్థాపించుకోవటానికేకాక, సకల ప్రకృతితోనూ సమతౌల్యతతో మెలగడానికి దోహదం చేసే విద్య.

మనమందరం ఏదో ఒకదాన్ని విలువైనదిగా భావించుకొని, దాని సాధనకోసం కొన్ని లక్ష్యాలను పెట్టుకొంటాం. దాన్ని సాధించుకొనే నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకొంటాం. ఈ నేపథ్యంలో అసలు మనకు నిజంగా అవసరమైనది, విలువైనది ఏది? అనే సత్యాన్ని తెలుసుకోలేము. సాధారణంగా మన దృష్టికోణాన్ని బట్టి నమ్మకాలు, ఇతర మాన్యతల్ని ( pre conditions ) బట్టి కోరికల్ని కల్పించుకొని వాటిని నెరవేర్చుకోవాలనుకుంటాం. ఈ విషయంలో మనకు అవగాహన లేకపోతే మనం జీవితంలో సామరస్యతను కోల్పోతాం.

సహజంగా మనకు కావలసింది ఆనందం. దానిని పొందటానికి ఏది ఉపయోగపడుతుందో దానిని ముఖ్యమైనదిగా విలువైనదిగా భావిస్తాం. ఆ విలువలే మన ఆలోచనల్ని, ప్రవర్తన, కార్యాచరణాలను నియంత్రిస్తాయి, నిర్దేశిస్తాయి.

సరైన అవగాహనతో, జ్ఞానంతో విలువల నిర్ణయం జరగకపోతే, మనం ఎన్నుకొన్న మార్గం తప్పో, ఒప్పో తెలియదు. అందుకనే మానవునికి సరైన విలువ ఏది? అనే ప్రశ్న అతి ముఖ్యమైనది.

దేనినుండి మానవుడు నిరంతరం ఆనందం, సంవృద్ధిని పొందగలుగుతాడో అదే సరైన మానవ విలువ. దీనికి సంబంధించి సరైన అవగాహన, స్వీయ పరిశీలన, సామరస్యం, ప్రకృతితో సహ అస్తిత్వం వంటి అంశాలకు చెందిన జ్ఞానం అవసరం.

మానవ విలువలు:- 1. విశ్వాసం (Trust) 2. సమ్మానం (Respect) 3. స్నేహభావం (Affection) 4. మమత (Care) 5. వాత్సల్యం (Guidance) 6. శ్రద్ధ (Relevance) 7. గౌరవం (Glory) 8. కృతజ్ఞత (Gratitude) 9. ప్రేమ (Love)

వీటిని సాహిత్యం ద్వారా బోధించి మానవ విలువల్ని అవగాహన చేసుకోవటం విద్యావిధానంలో ఒక మంచి ఆచరణ.